క్లుప్తంగా

అవార్డుల సాధనకు కృషి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డుల సాధన కోసం కృషి చేయాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీనికోసం ప్రభుత్వ శాఖలన్నీ తమ పనితీరును గణనీయంగా మెరుగు పర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు ఏయే రంగాల్లో అవార్డులను సాధించే అవకాశం ఉందో గుర్తించి, ఆ దిశగా ప్రణాళికలను రూపొందించి, గడువులోగా లక్ష్యాలను సాధించాలని కోరారు. ప్రభుత్వ శాఖల సామర్థ్య సూచికలు, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం ఇచ్చిన ఆదేశాల అమలుపై దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా శాఖల పనితీరు, లక్ష్యాల సాధనను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామర్థ్య సూచికలకు సంబంధించి జిల్లా స్థాయిలో 146 ఇండికేటర్లు ఉంటాయని, వాటన్నిటినీ ఆయా శాఖలు సకాలంలో కచ్చితమైన వివరాలతో నింపాలని ఆదేశించారు. అంశాల వారీగా కూడా లక్ష్యాలు ఉంటాయని, వాటిని చేరుకోవడంతో మంచి ర్యాంకును సాధించవచ్చని తెలిపారు. నెలవారీ, త్రైమాసిక, అర్ధ సంవత్సర, వార్షిక లక్ష్యాలను సాధించడంతో పాటు వాటిని సకాలంలో ఆన్‌లైన్లో నమోదు చేయాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, మత్స్య, వివిధ సంక్షేమ శాఖలు, పర్యాటకం, సాగు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యారోగ్యం తదితర శాఖల వారీగా సమీక్షించారు. జిల్లాలో ఉద్యాన సాగును 50 శాతానికి పెంచేందుకు కృషి చేయాలన్నారు. భూగర్భ జలాలను పెంచేందుకు చెక్ డ్యాములు, ఫారం పాండ్స్, చెరువుల మరమ్మతులు చేపట్టాలన్నారు. జిల్లా లక్ష్యానికి అనుగుణంగా 17.11 శాతం వృద్ధి రేటు సాధించడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సీపీఓ పి.బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

విజయనగరం గంటస్తంభం: కడప జిల్లాలో డిసెంబరు 6,7వ తేదీల్లో జరగబోయే సీపీఐ(ఎంఎల్) తొమ్మిదో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ శంకరరావు మాట్లాడుతూ సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వర్ధిల్లే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. దేశం ప్రమాదకర దిశలో సాగుతోందని, కార్పొరేట్, మతతత్వ శక్తుల పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు దెబ్బతింటున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు విప్లవ వామపక్ష ఉద్యమాన్ని బలపర్చాలని కోరారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు చేయండి



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు

భోగాపురం: నకిలీ మద్యం సరఫరా అవుతోందన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు మద్యం దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించి, నేర సమీక్ష చేశారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రతి మద్యం దుకాణానికి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించి, విశాఖ ల్యాబరేటరీకి పంపించాలని ఆదేశించారు. మందుబాబులు కూడా తీసుకున్నది నాసిరకం మద్యమా కాదా అన్నది తెలుసుకునేందుకు స్మార్ట్‌ఫోన్‌లో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

కూటమి కుట్రలు.. తిప్పికొడదాం

- చంద్రబాబుకు పాలన చేతగాకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ
- వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణలో భాగస్వాములమవుదాం
- నియోజకవర్గంలో 60 వేల సంతకాల సేకరణే లక్ష్యం
- నవంబరు 20లోగా గ్రామ, వార్డు కమిటీల నియామకం
- కోటి సంతకాల సేకరణ వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



కోటి సంతకాల ప్రజాఉద్యమం వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు

విజయనగరం: ప్రజలను నమ్మించి, మోసగించిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర రాజకీయాలను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను నగరంలోని తన నివాసం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం, పేద విద్యార్థులకు వైద్యవిద్య దగ్గర చేయాలనే సదుద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే పరిపాలన చేతగాని చంద్రబాబు మాత్రం వాటిని ప్రైవేటీకరణ చేయాలని చూస్తుండడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్నికలకు ముందు ఓ మాట..గెలిచిన తర్వాత మరో మాట మాట్లాడడం చంద్రబాబు నైజమన్నారు. ప్రతి ఎన్నికలప్పుడు ప్రజలను నమ్మించి మోసం చేయడం ఆయనకు అలవాటుగా మారిపోయిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రజలకు అత్యంత ముఖ్యమైన విద్య, వైద్యం వంటివి ప్రభుత్వమే నిర్వహిస్తుంటే ఇక్కడి ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం వెనక ఉద్దేశ్యమేంటని ప్రశ్నించారు.

ఇప్పటికే ఐదు కళాశాలల్లో తరగతులు..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి చర్యలు తీసుకోగా వాటిలో ఐదు కళాశాలల నిర్మాణం పూర్తిచేసి తరగతులు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. మరో రెండు కళాశాలల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు వాటిని(ప్రభుత్వ వైద్య కళాశాలలు) ప్రైవేటీకరణ చేస్తామనడం నిరుపేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయడమేనన్నారు. ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకవరపాలెంలోని నిర్మాణ దశలోని మెడికల్ కళాశాల సందర్శనకు వెళ్తే ఆయనకు భారీ స్థాయిలో లభించిన ప్రజామద్దతును ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు.

గవర్నర్‌కు ప్రజాభిప్రాయం చెబుతాం..

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజామద్దతు కోరుతూ కోటి సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతోంది. ఈ క్రమంలో నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ తర్వాత మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తూ గవర్నర్‌కు ప్రజాభిప్రాయం తెలియజేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలన్న దానిపై ప్రజల మద్దతు కోరాలని సూచించారు.

అడ్డు లేకుండా అక్రమ కేసులు..

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుళ్లు, కుతంత్రాలు, కుట్రలతో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా ఇంకా వైఎస్సార్ సీపీ, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం మానుకోవడం లేదన్నారు. పాలన చేతగాకే ఎదుటి వారిపై ఆరోపణలు అని ఎద్దేవా చేశారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, కక్షపూరిత రాజకీయాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులు, పేపరు అని చూడకుండా వారిని వ్యతిరేకించిన వారందరిపైనా అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలంతా దీనిని గమనించాలని కోరారు.

నవంబరు 20లోగా కమిటీల నియామకం..

పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నవంబరు 20వ తేదీలోగా గ్రామ, వార్డు కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని, అలాగే అనుబంధ కమిటీల నియామకం కూడా చేపట్టాలని తెలిపారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నందున బూత్ ఏజెంట్‌ల నియామకం పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో 261 బూత్‌లు ఉండగా ఇప్పటివరకు 150 బూత్‌లకు ఏజెంట్‌లను నియమించడం జరిగిందన్నారు. మిగిలిన వాటికి కూడా ఏజెంట్‌లను నియమించాలన్నారు. సమావేశంలో నగర డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేష్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ విజయనగరం మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ వీసీకి సన్మానం

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ(గురజాడ విజయనగరం) యూనివర్సిటీకి కొత్తగా వచ్చిన వీసీ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావును యూనివర్సిటీ ఈసీ(ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సభ్యులు, సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావులు కలిసి మంగళవారం సన్మానించారు. వీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. వర్సిటీ అనుబంధ కళాశాలల సిబ్బంది సహకారంతో వర్సిటీ మరింత ప్రగతి పథంలో నడిపిస్తామని వీసీ తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.జయసుమ, సీతం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీడీవీఏ నాయుడు పాల్గొన్నారు.

24న 'చలో ఢిల్లీ'

విజయనగరం అర్బన్: ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నామని దీనిపై ఈ నెల 24వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఏఐపీటీఎఫ్(అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య) జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎస్.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి వి.రమణ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాలో జిల్లా నుంచి ఉపాధ్యాయులంతా వచ్చి పాల్గొనాలని కోరారు. జాతీయ అధ్యక్షుడు బసవరాజ్ గురికర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన అత్యవసర గూగుల్ మీట్‌లో దేశ వ్యాప్తంగా 25 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులంతా పాల్గొని, చర్చించి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఏజీఎస్ గణపతిరావు తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పూసపాటిరేగ: వరి సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుమిలి గ్రామంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిలో చిరుపొట్ట దశ నుంచి బియ్యపు గింజ ఏర్పడే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. అలాగే వరి పంటను ఆశించే ఆకుముడత, సుడిదోమ, మానిపండు తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను శాస్త్రవేత్త కె.తేజేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి కె.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లోకం నాగమాధవికి వేల కోట్లు ఎలా వచ్చాయి?

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పలనాయుడు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు

పూసపాటిరేగ: ఒకప్పుడు సాధారణ వ్యక్తి అయిన నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవికి ఇప్పుడు వందల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయలు ఉన్నాయంటే అవి ఎలా వచ్చాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జెడ్పీటీసీ ప్రతినిధి మహంతి జనార్దనరావు, వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్‌లు ప్రశ్నించారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఎమ్మెల్యే నాగమాధవి తన వద్ద పనిచేసే ఉద్యోగులకు రూ.12 వేలు చొప్పున అరకొరగా జీతాలిచ్చి వారి నుంచి చేసుకున్న శ్రమదోపిడీ ద్వారా వేల కోట్లు సంపాదించారని విమర్శించారు. ఇదే పూసపాటిరేగకు చెందిన కునుకు హేమకు ఉద్యోగం ఇచ్చి రెండేళ్ల పాటు పని చేయించుకుని ఆమెకు కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. ఎంతో మంది విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడి చేసిన అక్రమ సంపాద ఆమె సంపాదన అని దుయ్యబట్టారు. 2024 ఎన్నికల్లో కూడా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిస్తామని ఓట్లు వేయించుకున్నారని, తీరా గెలిచాక ముఖం చాటేశారన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వంద కంపెనీలు తెచ్చి ఉద్యోగాలిస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే భర్త ప్రసాదు తీరు కూడా సరికాదన్నారు. ఆయన అధికారాన్ని అడ్డం పెట్టుకుని విలేకరులను బ్లాక్‌మెయిల్ చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. డెంకాడ ఎంపీపీ వాసుదేవరావు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ ఇంటి వద్దకు వెళ్లి పనులు చేయించుకుని..నీవా బడ్డుకొండను విమర్శించేదని అన్నారు.

ఒడ్డు చేరాక తెప్ప తగలేసే రకం..

చింతలవలసలో ఎంపీటీసీని చేసి ఎంపీపీగా చేస్తే అధికారం మారగానే బాణాలు ఎక్కుపెట్టడం చూస్తే ఒడ్డు చేరాక తెప్ప తగలేసే రకంగా కనిపిస్తోందన్నారు. రోజుకో పార్టీ మారిన పతివాడ శ్రీనివాసరావుకు వైఎస్సార్ సీపీలో ఉన్నప్పుడు ఎంపీటీసీ, సర్పంచ్, రెండుసార్లు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పదవులు ఎవరు ఇచ్చారో గుర్తు చేసుకోవాలన్నారు. అవన్నీ బడ్డుకొండ సహకారంతో వచ్చినవి కాదా అని ప్రశ్నించారు. కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు..రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చేసిన వ్యవహారమంతా ప్రజలకు తెలుసు అన్నారు. 40 అడుగుల రహదారులు వేయడం, మొక్కలు వేసినట్లుగా నీవు చేస్తున్న డ్రామాలు కొవ్వాడ గ్రామస్తులు ఎప్పుడో గమనించారన్నారు. కొవ్వాడ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ చేసిన అభివృద్ధి, తప్పులతడకగా ఉన్న భూరికార్డులను సరిచేసి 1400 పాసుపుస్తకాలు తయారు చేయించి ఇచ్చిన విషయం మర్చిపోయావా అని అన్నారు. వెంపడాం సర్పంచ్ పిన్నింటి కుమార్, తండ్రి రమణలు రోజుకో పార్టీ మారి ప్రజలను మభ్యపెట్టడం తప్ప చేసిందేమీ లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండపై చేసిన తప్పుడు ఆరోపణలు వెనక్కి తీసుకోవాలన్నారు. బడ్డుకొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, జి.సురేష్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మణరావు, నాగరాజు, అరుణకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సూచించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. బాణసంచా దుకాణాలు, తయారీ కేంద్రాలు, గొడౌన్‌లు గ్రామ, పట్టణ, నగర శివారుల్లో మాత్రమే ఉండాలన్నారు. దుకాణానికి దుకాణానికి మధ్య 15 మీటర్ల దూరం ఉండాలన్నారు. లైసెన్స్‌లు పొందిన విక్రయదారులు మాత్రమే బాణసంచా కొనుగోలు చేయాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పాటించాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులు, బ్యానర్లు, ఫ్లెక్సీలు షాపుల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాల్లో బాణసంచా తరలించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని, ఆలయ అర్చకులు చాణక్య, హర్ష, కృష్ణతేజలు సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇవటూరి నారాయణశర్మ ఆధ్వర్యంలో బాలకొండ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం నీరజాశ్రీనివాస్, వాల్మీకి పరిశోధన కేంద్రం కో-ఆర్డినేటర్ నారాయణం గౌరీనిత్య తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన శ్రీపైడితల్లి దర్శనానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. జిల్లా కేంద్రంలోని అమ్మవారి ఆలయానికి పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తజనం క్యూలైన్‌లలో ఎండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి వేచి ఉండి దైవదర్శనం చేసుకున్నారు. అయితే భక్తులు వేచి ఉన్న చోట ఎండ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేయకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన



ప్రైవేట్ బ్యాంక్ విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు మంగళవారం నిరసనకు దిగారు. ఆలిండియా ప్రైవేట్ బ్యాంక్ యూనియన్ సెల్ ఇచ్చిన పిలుపు మేరకు ఏఐబీఈఏ(ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్), స్టేట్ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో విజయనగరంలోని లయన్స్ క్లబ్ జంక్షన్ వద్ద ఉన్న ఫెడరల్ బ్యాంక్ ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రైవేట్ బ్యాంక్‌ల ఉద్యోగులు పాల్గొని, తమ పట్ల ప్రైవేట్ బ్యాంక్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్న దుర్మార్గపు వైఖరిని తప్పుబట్టారు. ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వేతన రివైజ్, రిటైర్మెంట్ వయసు పెంపు వంటి డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం కో-ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు బీవీ ప్రసాద్, కార్యదర్శి మురళీశ్రీనివాస్, కొటక్ మహీంద్రా, ఫెడరల్, కేవీబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

జీవో నంబర్ 21ను రద్దు చేయాలి



స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా రాష్ట్రంలోని ఆటోవాలాలకు ఉపాధి పోయిందని ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆటోవాలాలకు వాహనమిత్ర సాయం రూ.25 వేలకు పెంచాలని, జీవో నంబర్ 21 రద్దు, అచ్యుతాపురంలోని ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్ రద్దు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి డిమాండ్లతో చేసే ధర్నాకు ప్రతి ఆటో కార్మికుడు హాజరుకావాలని ఆయన కోరారు. – విజయనగరం గంటస్తంభం

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించండి



గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు సూర్యానారాయణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై డెంకాడ మండల కేంద్రంలో ఎంపీడీవో భవానికి గ్రీన్ అంబాసిడర్లతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టే వారికి ఇచ్చే కనీస గౌరవ వేతనం కూడా పెండింగ్‌లో పెడితే వారెలా బతకాలని ఆయన ప్రశ్నించారు. సీఐటీయూ పోరాట ఫలితంగా వారికి ఇదివరకు ఇచ్చే రూ.5 వేలను రూ.6 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వుల ప్రకారం ఇచ్చే వేతనంతో పాటు హెల్త్ అలవెన్స్ కింద మరో రూ.4 వేలు కలిపి మొత్తం రూ.10 వేలు అందించాలన్నారు. – డెంకాడ

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండపై.. నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు..

- వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు

డెంకాడ: నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జనసేన పార్టీ నాయకుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు(పాల శ్రీను)లు ఏది పడితే అది నోటికి వచ్చిందల్లా మాట్లాడుతున్నారని, అది సరికాదని హద్దు మీరితే సహించేది లేదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు ఖండించారు. ఇదే విషయమై ఆయన మండలంలోని పినతాడివాడ గ్రామ సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఇంటి వద్ద మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ వాసుదేవరావు, జనసేన నాయకుడు పాలశ్రీనులు స్థాయిని మరిచిపోయి మరీ మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండపై లేనిపోని విమర్శలు చేశారన్నారు. మీకు ఎంపీపీ పదవి రావడానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కారణం కాదా అని ప్రశ్నించారు. వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీలు మారే నైజం మీది కాదా అన్నారు. బడ్డుకొండ అప్పలనాయుడు గ్రామానికి చెందిన మీకు ఆయన ఆస్తుల గూర్చి తెలియదా అని ప్రశ్నించారు. దందాల కోసం పార్టీ మార్చే నైజం మీదన్నారు. ఆన్‌లైన్ చేయిస్తానని రైతుల వద్ద నుంచి మీరు డబ్బులు తీసుకున్న మాట వాస్తవం కాదా అన్నారు. డి.పట్టా భూముల విషయమై రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించుకున్నది నిజం కాదా అని ధ్వజమెత్తారు.

స్థాయి మర్చిపోయి విమర్శలా?

కొండరాజుపేట పొలిమేరల్లో ఉన్న కొండపై గ్రావెల్ అక్రమంగా తవ్వేసి దొరికిపోవడం అవాస్తమా అని అన్నారు. మీ డ్రైవర్ పేరుతో మీరు భూములు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నది అబద్ధమా అని అన్నారు. అక్రమాలపై చర్చకు మేం సిద్ధం.. మీరు సిద్ధమా అని సవాలు విసిరారు. వైఎస్సార్ సీపీ గుర్తుపై ఎంపీపీ అయి వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండపై అసత్య ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. పాలశ్రీను కూడా తన స్థాయి ఏమిటన్నది మరిచిపోయి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండను విమర్శిస్తున్నారని, మాన్సాస్ భూముల్లో ఉంటుంది మీరు కాదా అని నిలదీశారు. అక్రమాలు, మోసాలలో నీ చరిత్ర అందరికీ తెలుసున్నారు. తప్పుడు ప్రేలాపనలు చేస్తే మర్యాదగా ఉండదన్నారు. నీ స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలన్నారు. మీ ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఎన్నికలకు ముందుకు వంద రోజుల్లో వంద కంపెనీలు తెస్తానని హామీ ఇచ్చారని, ఆ కంపెనీలు ఏమయ్యాయో నిలదీయాలన్నారు. యువతకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.కోటినాయుడు, బి.రమణ, ఎల్.లక్ష్మణరావు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీ అమలెప్పుడు?



మాట్లాడుతున్న ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రబాబు

విజయనగరం గంటస్తంభం: వలంటీర్లకు ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారని సీఎం చంద్రబాబును ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని డీఎస్ఆర్ అమర్ భవన్‌లో మంగళవారం జరిగిన వలంటీర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలప్పుడు తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా వలంటీర్లకు ఇచ్చిన హామీపై నోరు మెదపడం లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేకుంటే పోరాటం తప్పదన్నారు. వలంటీర్లంతా ఐక్యంగా తమకు ఇచ్చిన హామీ అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.